క్లుప్తంగా

ప్రమాదకరంగా వంతెన



కోతకు గురైన వంతెన వద్ద ఓ వైపు భాగం

వీరఘట్టం: తోటపల్లి ఎడమకాలువపై అచ్చెపువలస వద్ద ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. ఒకవైపు వంతెనపై ఉన్న రెయిలింగ్ ఊడిపోతుండగా.. మరో వైపు వంతెనకు గట్టు కోతకు గురైంది. ఈ వంతెనపై వస్తూ ఆవులు, గేదెలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. అధికారులు స్పందించి వంతెన వద్ద కోతకు గురైన చోట మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఒక్క ఇల్లూ నిర్మించలేదు..!



ఖాళీగా ఉన్న జగనన్న కాలనీ స్థలం

వీరఘట్టం: మండలంలోని అచ్చెపువలస వద్ద గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీ ఏర్పాటు చేసి 365 మందికి పట్టాలిచ్చారు. అయితే ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులెవ్వరూ ముందుకు రావడం లేదు. ఇటీవల అధికారులు సర్వే చేపట్టి ఇందులో 80 మంది అనర్హులున్నట్లు తేల్చారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం పూర్తయినా నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులను ప్రోత్సహించలేదు. అధికారులు స్పందించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు.

పాడిరైతుల సమస్యలు పరిష్కరించాలి



చెట్లనీడలో సేదదీరుతున్న ఆవులు


సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం పాల ఉత్పత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు తప్పడంలేదని పాడి రైతులు ఆదోళన చెందుతున్నారు. సీతానగరం మండలంలో వ్యవసాయంపై ఆధారపడి ఉన్న చిన్న సన్నకారు రైతులు వ్యవసాయం చేసుకుంటూ వాణిజ్యపరంగా పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని రామభద్రపురం మిల్క్ చిల్లింగ్ కేంద్రం పరిధిలో ఉన్న గ్రామాలనుంచి 16 వేలమంది రైతులు రోజుకు 80 వేల లీటర్లు పాలు సేకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో రంగంపేట, కాశీపేట, వెంకటాపురం, అంటిపేట, జోగింపేట, గుచ్చిమి, వెన్నెలబుచ్చింపేట, కె సీతారాంపురం, పీబీ పేట, కృష్ణారాయపురం, బగ్గందొరవలస, బక్కుపేట, బీకే పురం, రామవరం, రెడ్డివానివలస, జానుమల్లువలస గ్రామాల రైతులు వాణిజ్యపరంగా దీర్ఘకాలంగా పాల పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. ఒక్కో గ్రామం నుంచి రోజుకు 350 నుంచి 600 లీటర్ల పాలు విశాఖ డైరీకి విక్రయిస్తున్నారు. వారంతా విశాఖ డైరీ రామభద్రపురం మిల్క్ చిల్లింగ్ కేంద్రానికి పాలను సరఫరా చేస్తున్నారు. విశాఖ డైరీ లీటరు పాలు రూ.36 నుంచి రూ.39 వరకూ కొనుగోలు చేయడంతో గిట్టుబాటు ధర వచ్చేదని పాడిరైతులు అంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం లీటరు పాలకు మద్దతు ధర రూ.6 నుంచి రూ.7 వరకూ విశాఖ డైరీ యాజమాన్యం తగ్గించిందని పాడి రైతులు వాపోతున్నారు. పాడి ఆవుల కొనులు ధరలు గణనీయంగా పెరగడం . పుష్టి బస్తాల ధర నాటికీ నేటికీ రూ 200 లు పెంచారని అంటున్నారు. అయినా పాలకు మద్దతు ధరలేక పోవడం, గడ్డి విత్తనం ఉచితంగా సరఫరా చేయకపోవడంతో పాల ఉత్పత్తులు పెంచినా మద్దతు ధర లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. విశాఖ డైరీ యాజమాన్యం తగ్గించిన పాలధరను పెంచాలని, పాడి పశువు ఉన్న రైతులకు గోశాలలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

యోగాపై ఉత్తమ శిక్షణ ఇవ్వాలి

● డాక్టర్ జగన్మోహన్

పార్వతీపురంటౌన్: యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా మాస్టర్ ట్రైనీలకు యోగాపై రెండు రోజు ల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎన్సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు పాల్గొన్నారు. ఢిల్లీ నుంచి యోగా గురురాహుల్ సింగ్ చౌహాన్ వర్చువల్ పద్ధతిలో శిక్షణ ఇచ్చారు. కార్యక్ర మం అనంతరం డాక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అంతర్జాతీయ యోగా దినోత్సవం మాసోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మాస్టర్ ట్రైనీలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించారని, అనంతరం మండల స్థాయి ట్రైనీలకు వారు శిక్షణ ఇవ్వాలన్నా రు. యోగా మార్గదర్శకాలు పాటిస్తూ నైపుణ్యంతో కూడిన శిక్షణ అందజేయాలని మాస్టర్ ట్రైనీలకు సూచించారు.

పచ్చిరొట్ట సాగు.. భూసారం బాగు!



సాగు చేస్తున్న కట్టిజనుము(ఫైల్)

- పచ్చిరొట్ట సాగుకు అనువైన సమయం
- ఖరీఫ్ పంటలకు ముందే వేసుకోవాలి
- భూసారం పెరిగి దిగుబడులకు ఆస్కారం

గరుగుబిల్లి/గుమ్మలక్ష్మీపురం:

పచ్చిరొట్ట సాగుకు ఇదే సరైన, అనువైన సమయం.. ఖరీఫ్ పంటల సాగుకు ముందు వేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. వేసవిలో దుక్కి చేసుకుని పచ్చిరొట్ట పొలాల్లో వేసుకోవడం ద్వారా నేల సారవంతమై ప్రధాన పంటలకు కావాల్సిన పోషకాలు లభ్యమవుతాయి. ఈ నేపథ్యంలో పచ్చిరొట్ట సాగుకు రైతులు సమాయత్తం కావాలని, అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు పిలుపునిస్తున్నారు. రైతులకు పంపిణీ చేసేందుకు పచ్చిరొట్ట ఎరువులు సిద్ధంగా ఉన్నాయని, రాయితీపై ఇచ్చే పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు. ఖరీఫ్‌కు మరో 40 రోజుల సమయమే ఉన్నందున ఇప్పుడే పచ్చిరొట్ట వేసి, భూసారం పెరిగి సాగులో సత్ఫలితాలు చూడొచ్చని చెబుతున్నారు.

రసాయన ఎరువులతో నిస్సారం..

ప్రస్తుతం అంతటా పొలాల్లోని పంటలకు రసాయన ఎరువులు వినియోగించడం వల్ల నేల సారం తగ్గి, దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయి. పూర్వకాలంలో ఆవుపేడ, చెరువు మట్టి, గెత్తం(పెంట వ్యర్థాలు) వంటి సేంద్రియ ఎరువులు వినియోగించే వారు. తద్వారా నాణ్యమైన పంట, అధిక దిగుబడులు వచ్చేవి. కాలక్రమేణా సంప్రదాయ ఎరువుల వినియోగం తగ్గి రసాయన ఎరువుల వినియోగం పెరిగింది. తక్కువ కాలంలో పంట దిగుబడుల కోసం రైతులంతా రసాయన ఎరువుల వినియోగించడం మొదలుపెట్టారు. అయితే వాటి వల్ల భూసారం తగ్గిపోతోందని ఇప్పుడు గ్రహించారు. ప్రస్తుతం రసాయన ఎరువులు వద్దు.. సేంద్రియ ఎరువులే ముద్దు అని భావిస్తూ అందరూ ఆవుపేడ, చెరువు మట్టి, గెత్తం వంటి వాటిని పొలాల్లో వేసుకుంటున్నారు.

ప్రకృతి సేద్యం వైపు మరలండి..

ఆరోగ్యవంతమైన పంట, దిగుబడుల సాధనకు ప్రకృతి వ్యవసాయం వైపు మరలాలి అని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ప్రకృతి సేద్యంలో భాగంగా భూసారానికి పచ్చిరొట్ట ఎరువులు సాగు చేసుకోవాలి. ఇప్పటికే రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో పచ్చిరొట్ట ఎరువులు ఉన్నాయి. వీటిని సబ్సిడీ(రాయితీ)పై అందిస్తారు. ఈ విషయంపై ఇప్పటికే రైతులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కురుపాం నియోజకవర్గంలోని గరుగుబిల్లి, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, జియ్యమ్మవలస మండలాల్లోని రైతు సేవా కేంద్రాల్లో జీలుగు, కట్టిజనుము, పిల్లిపెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.



ఖరీఫ్ సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతులు(ఫైల్)

పచ్చిరొట్టతో మేలు..

పచ్చిరొట్ట సాగుకు 45 రోజుల ముందే పొలాల్లో జీలుగు, కట్టిజనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలు సాగుచేయడం వల్ల ప్రధాన పంటలకు మేలు జరుగుతుంది. పొలాల్లో జీవ రసాయనిక చర్యలకు ఉపయోగపడడం వల్ల క్రమక్రమంగా భూసారం పెరుగుతుంది. వర్షాలు కురిసినప్పుడు కూడా నేల కోతకు గురికాకుండా పచ్చిరొట్ట పంట కాపాడుతుంది. అంతేకాకుండా పచ్చిరొట్ట సాగు చేస్తే నేల గుల్లగా మారి నేలలోకి నీరు సులభంగా ఇంకేలా చేస్తుంది. అలాగే కలుపు మొక్కలు పెరగకుండా చేయవచ్చు. జీలుగు, కట్టిజనుము వంటివి పొలాల్లో వేసుకోవడం వల్ల వాటి వేర్లు నేల లోతుకు వెళ్లి, అక్కడి పంటలకు కావాల్సిన పోషకాలను నేలకు దగ్గరగా తీసుకువస్తాయి. దీంతో నేలలో నత్రజని శాతం పెరిగి పంటలు బాగా పండుతాయి.

50 శాతంపై రాయితీపై విత్తనాలు..



నేల సారవంతానికి ఉపయోగపడే పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీపై రైతులకు అందిస్తున్నాం. కావాల్సిన వారు రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించాలి. పచ్చిరొట్ట సాగుతో పంటల దిగుబడుల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

–ఆర్.విజయభారతి, ఏవో, గరుగుబిల్లి

యోగాతో ఆరోగ్య సిద్ధి..



పాలకొండ రూరల్: క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా శిక్షకుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు కె. జనార్దనరావు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక నగర కార్యాలయ సిబ్బందికి ఆసనాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా సూర్య నమస్కారాల విశిష్టత, వాటిని అనుసరించే విధానం, తద్వారా లభించే ఉపసమనాలపై వివరించారు. నేటి యాంత్రిక సమాజంలో ఒత్తిడిని అధిగమించేందుకు అన్నివర్గాల వారు యోగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ రత్నరాజు, ఎంపీఓ విజయరంగారావు, వైద్యులు రవికుమార్, పావని, విష్ణుప్రియ, శిరీష, ఆదిలక్ష్మి, నందనసాయి, తదితరులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీతో సమస్యలు



వీరఘట్టం సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

● ఆందోళన చేపట్టిన నడుకూరు గ్రామస్తులు



విద్యుత్ సమస్యపై పోలీసులతో మాట్లాడుతున్న నడుకూరు గ్రామస్తులు

వీరఘట్టం: గ్రామంలో రెండు రోజులుగా లో ఓల్టేజీ సమస్య వేధిస్తోందని.. దీనికి తోడు విద్యుత్ సరఫరా ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు ఉండదో తెలియని పరిస్థితి నెలకొందని నడుకూరు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామంలో ఓ వైపు సంబరాలు జరుగుతున్నాయని, పెద్ద ఎత్తున చుట్టాలు, బంధువులు చేరుకోవడంతో ఊరంతా సందడిగా ఉన్న సమయంలో ఎప్పటికప్పుడు సరఫరా నిలిపివేస్తున్నారని మండిపడ్డారు. విద్యుత్ సక్రమంగా ఉండకపోవడంతో తాగునీటి సరఫరా కూడా జరగడం లేదన్నారు. ఆందోళన విషయం తెలుసుకున్న ఎస్సై జి. కళాధర్ సబ్‌స్టేషన్ వద్దకు చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. అలాగే ఏఈ అనిల్‌కుమార్ వచ్చి నచ్చజెప్పడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. అనంతరం ఏఈ, తదితరులు గ్రామానికి చేరుకుని విద్యుత్ సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు.

ఊరటనిచ్చిన వర్షం



పాలకొండ : పట్టణ పరిసరాల్లోని పొలాల్లో చేరిన నీరు



భామిని: కీసరలో కురుస్తున్న భారీ వర్షం

పాలకొండ రూరల్: ఉదయం నుంచి ఉక్కబోత అటుపై లో ఓల్టేజీతో ఇబ్బందులు పడిన పాలకొండ వాసులకు ఆదివారం సాయంత్రం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. దాదాపు గంట సమయం ఎడతెరిపి లేకుండా భారీ స్థాయిలో వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు, పొలాల్లోనీరు చేరింది. ఖరీఫ్ సాగుకు ఈ వర్షం ఎంతో మేలు చేయనుందని రైతులు చెబుతున్నారు.

భామినిలో..

భామిని: మండలంలోని కీసర, కోసలి, పెద్దదిమిలి, సతివాడ, కొరమ, చిన్నదిమిలి గ్రామాల పరిధిలో భారీ వర్షం కురిసింది. వర్షంతో పాటు ఈదురు గాలులు వేయడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

నేడు శాంతియుత ర్యాలీ

సీతంపేట: ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం వివిధ సమస్యలపై శాంతియుత ర్యాలీ నిర్వహించనున్నట్లు జేఏసీ నాయకులు బి.శ్రీనివాసరావు, బి.ఉమామహేశ్వరరావు, తదితరులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వారపు సంత నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీ జరుగుతుందని పేర్కొన్నారు. గిరిజనులంతా హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఇన్‌చార్జ్ డీఈవోగా గిరిజన మహిళను నియమించండి

గుమ్మలక్ష్మీపురం: గిరిజన మహిళ, అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారి.. ఇన్‌చార్జ్ డీఈవోగా పనికిరారా అని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ప్రశ్నించారు. ఇదే విషయమై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లాకు రెగ్యులర్ డీఈవోను నియమించేంత వరకు గిరిజన మహిళ అయిన రామాజ్యోతిని ఇన్‌చార్జ్ డీఈవోగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి, గిరిజన మహిళను కాదని ఇతరులకు ఇన్‌చార్జ్ డీఈవోగా నియమిస్తే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సమస్యల ప్రస్తావన లేకుండా రాజకీయాలు

పార్వతీపుం: కొన్ని నెలలుగా నిర్వహించని పార్వతీపురం మున్సిపల్ సాధారణ సమావేశం ఈనెల 23న నిర్వహించి ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రస్తావన చేసి చర్యలు చేపట్టాల్సిందిపోయి పవిత్రమైన మున్సిపల్ కౌన్సిల్ గౌరవ సభను కౌరవ సభగా మార్చేశారని కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించారు. ఈ మేరకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఓబీసీ పార్వతీపురం మన్యం జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు మాట్లాడుతూ పార్వతీపురం మున్సి పాలిటీలో జరిగిన బడ్జెట్ సమావేశంలో నాయకుల తీరు చూస్తే అది గౌరవ సభ..? లేక కౌరవ సభ..? అనే అనుమానం కలిగిందన్నారు. పార్వతీపురం మున్సిపల్ చరిత్రలో పోలీస్ అధికారులు కౌన్సిల్ సమావేశం జరుగుతున్న సమయంలో కౌన్సిల్ సమావేశ మందిరంలోకి రావడం బహుశా ఇదే ప్రథమమని విస్తుపోయారు. ప్రజలతో ఎన్నికై న సభ్యులు, కౌన్సిల్ అంగీకారం తెలిపిన వ్యక్తులకు మాత్రమే సభలోకి ప్రవేశం ఉంటుందన్నారు. అటువంటిది కౌన్సిల్ అనుమతి లేకుండా కౌన్సిల్ సమావేశం మందిరంలోకి పోలీసులు, కార్యాలయంలోకి మరి కొంతమంది వ్యక్తులు రావడం, సభలో గందరగోళం సృష్టించడం, పార్వతీపురం మున్సిపాలిటీ కి, సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి ఆరోగ్యకరమైన పరిస్థితులు కావంటూ పెదవి విరిచారు. వ్యక్తిగత, పార్టీ పరమైన కక్షలతో గౌరవ సభను రోడ్డుకీడ్చారని అసహనం వెళ్లగక్కారు. ప్రజా సమస్యలను చర్చించి వాటి పరిష్కారానికి పలు తీర్మానాలు చేయాల్సిన విలువైన సమయాన్ని రాజకీయ కుట్ర లతో వృథా చేశారని, అవగాహన లేని నాయకులు సభను అప్రతిష్ట పాలు చేశారని ఆరోపించారు. దీనిపై కలెక్టర్, పాలకులు స్పందించి పుర పాలనను చక్కదిద్దాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు టి.గౌరీశంకరరావు, జి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జూన్ 3న వేపారమ్మకు చల్లదనం



ఆలయం వద్ద సమావేశమైన ఆలయ కమిటీ సభ్యులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో కొలువైన గ్రామదేవత వేపారమ్మకు జూన్ 3వ తేదీన చల్లదనం పూజలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ బి.గౌరీశంకరరావు తెలిపారు. ఇదే విషయమై ఆదివారం ఆలయ కమిటీ సభ్యులంతా ఆదివారం సమావేశమై, కార్యక్రమంపై తీర్మానం చేశారు. గ్రామస్తులంతా పూజల్లో పాల్గొని, అమ్మవారి ఆశీర్వాదాలు పొందాలన్నారు.

అక్రమాలపై దర్యాప్తు చేపట్టండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రైతు సంఘ ప్రతినిధులు

● ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు

పాలకొండ: తోటపల్లి ఎడమ కాలువ పరిధిలో పనులకు సంబంధించి చోటుచేసుకున్న అక్రమాలపై పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టాలని ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు డిమాండ్ చేశారు. మండలంలోని రుద్రిపేటలో రైతుసంఘ నాయకులతో కలిసి ఆదివారం పర్యటించారు. ఈ నెల 28న సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టనున్న ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాలువలో పూడికలు తీయమని కొన్ని నెలలుగా కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పూడికలు తీయకుండానే బిల్లులు పెట్టడం ఆశ్చర్యంగా ఉందని చెప్పారు. ఒకవైపు రైతులు సాగునీరు అందక ఇబ్బంది పడుతుంటే.. పనులు చేయడానికి నిధులు లేవని చెప్పిన అధికారులు బిల్లులు మంజూరు చేయడంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని కోరారు.

దంతాలు శుభ్రంగా ఉంచుకోండి



ఆరోగ్య తనిఖీల అనంతరం ప్రిస్క్రిప్షన్ రాస్తున్న వైద్యుడు రాజేష్

జియ్యమ్మవలస: ప్రతిఒక్కరూ దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యుడు పెంటపాటి రాజేష్ సూచించారు. మండలంలోని పెదబుడ్డిడి గ్రామంలో పార్వతీపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ సూర్యకళా దంత వైద్యశాల వారి సౌజన్యంతో ఉచిత దంత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. పంటి సమస్యలతో బాధపడుతూ శిబిరానికి హాజరైన వారి దంతాలను వైద్యులు తనిఖీ చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. అతి చల్లని, వేడి పదార్థాలు తినరాదని, ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం దంతాలు శుభ్రంగా తోముకోవాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బి.నాగభూషణరావు, శశికళ పాల్గొన్నారు.

● సాగునీరు వృథా..



వీరఘట్టం: తోటపల్లి జలాశయం వద్ద ఎడమ కాలువ ప్రధాన రెగ్యులేటర్ పాడవ్వడంతో కాలువ గుండా సాగునీరు వృథాగా పోతోంది. ప్రస్తుతం నువ్వు పంట సాగులో ఉంది. ఈ పంటకు పెద్దగా నీరు అవసరం లేకపోయినా, కాలువ ద్వారా నీరు పొలాల్లోకి చేరుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో రెండు నెలల్లో ఖరీఫ్ సాగుకు నీటి అవసరం ఉందని.. నీరు ఇలాగే వృథాగా పోతే అప్పటికి నీరు ఉంటుందో, ఉండదోనని అన్నదాతలు తలలు పట్టుకుంటున్నారు. అధికారులు స్పందించి రెగ్యులేటర్‌కు మరమ్మతులు జరిపి సాగునీటి వృథాను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

● కొత్త రోడ్డుకు మరమ్మతులు



కూటమి ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లు కొద్ది రోజుల్లోనే పాడవుతున్నాయి. మండలంలోని నులకజోడు – బిల్లుమడ గ్రామాల మధ్య ఇటీవల తారు రోడ్డు నిర్మించారు. అయితే కొద్ది రోజుల్లోనే రోడ్డు పాడవ్వడంతో విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో కాంట్రాక్టర్ పాడైన రోడ్డును తొలగించి మళ్లీ వేస్తున్నారు.

–భామిని